# భర్తల దినోత్సవం!

మైక్‌లోనుండి విన్పించే సుప్రభాతం విన్న సుబ్బారావు మాంచి నిద్రలో వున్నవాడల్లా వులిక్కిపడి లేచి... గోడ గడియారం వేపు ఓ లుక్కిచ్చి 'వామ్మో!... ఆరు కావస్తోంది... లేటయితే నా వీపుని విమానం మోతే...' భయపడుతూ మంచం దిగి బాత్రూమ్‌లోకి దూరేడు.

కాలకృత్యాలు తీర్చుకునొచ్చి కిచన్లోకి జొరబడి పాలకుక్కర్ స్టౌ వెలిగించి దానిమీద పెట్టాడు.

భార్యామణేమో ఇంకా డబుల్‌కాట్ బెడ్‌మీద హిడింబిలా పడుకుని ఇంటి శ్లాబ్ క్రాకు లిచ్చేట్టంత శ్రవణానందకరంగ గుర్రుపెడుతోంది. ఇరుగుపొరుగువారిని భయ పెడుతోంది.

ఓసి దీని దుంపతెగ!... దీని రాక్షస గురక నాశనమైపోనూ... నాకిదెక్కడ దాపురించిందిరా దేవుడా... అనేసి సుబ్బారావు తన్లో తాను గొణుక్కుంటున్న క్షణాల్లో...

సడన్‌గా నిద్రలేచి వళ్ళు విరుచుకుంటూ బకాసరుడు నిద్రలేవగానే 'ఆకలి... ఆకలి' అంటూ అరచినట్టు... 'ఒరేవ్ మొగుడు సచ్చినోడా... నాకు బెడ్‌కాఫీ ఏదిరా... నువ్వేమో కిచన్లో చేరి రెండోకంటికి తెలీకుండా బూస్టు... హార్లిక్సూ తాగుతావా?...'' పాచిమొహంతో శాపనార్థాలు పెట్టింది.

'ఈరోజు భర్తల దినోత్సవమే!... ఈ వక్కరోజైనా నన్ను తిట్టకే పవిత్రా...' కాఫీ గ్లాసుతో ప్రత్యక్షమై బెడ్‌కాఫీ అందించాడు.

గ్లాసెడు కాఫీ ఒక్క గుక్కలో గొంతులో పోసుకుని గుటుక్కునమ్మింగి 'తిట్టకూడదు... కానీ కొట్టచ్చా...' బుల్‌డ్రౌజర్ లాంటి భారీ కాయాన్ని మంచంమీది నుంచి నేలమీదికి దించింది.

ఆ దిగటంతో పవిత్ర కాలికింద మొగుడి కాలిపాదం పడడంతో 'కెవ్'న కేకేసి లబలబమొత్తుకున్నాడు.

'పొద్దుటే నీ ఏడుపేంటి?' కాలు వెనక్కి లాక్కుని భర్తనెత్తిన మొట్టికాయ వేసింది పవిత్ర.

పెళ్ళాం వేసిన మొట్టికాయతో నెత్తి చిల్లిపడ్డట్టన్పించింది.

'అట్లా చూస్తూ నిలబడకపోతే... నన్ను వాషబేసిన్ దాకా చేయి పట్టుకు నడిపించి... నా పళ్ళు బ్రష్ చేయకూడదా ఏం?...' హూంకరించింది.

చేస్తానే రాక్షసీ! చేయక ఛస్తానా?... నీ పళ్ళూ తోముతాను... వీపు రుద్దుకోవటానికి చేతులు అందవు కనుక... వీపు తోమి (అంట్లు తోమినట్టు) స్నానమూ చేయిస్తాను! ఇంకా... బ్రేక్‌ఫాస్ట్ తినిపిస్తాను... భోజనం సమయానికి కంచంలో అన్నం కలిపి ముద్దలు చేసి నోటికీ అందిస్తానే...

నా ముద్దుల పెళ్ళామా... అది తిట్లో దీవెనో అర్థంకాని రీతితో గొణుక్కున్నాడు సుబ్బారావు.

'ఈ ఒక్కరోజైనా నీ భర్తనైన నన్ను కష్టపెట్టక... ఎంచక్కా... నీ పన్లు నీవే చేసుకుంటే... బోలెడంత పుణ్యం మూటకట్టుకుంటావే?... భర్తని గౌరవిస్తూ... పూజిస్తే... వచ్చే జన్మలో నువ్వు స్లిమ్‌గ... హేండ్సమ్‌గ... ప్రపంచ సుందరిగా పుడతావే...'

'ఏడిశావ్!... నాకు తిక్కరేగిందంటే ఒక్కటిస్తాను. పన్లన్నీ నేనే చేస్తే... ఇంట్లో ఇక నువ్వెందుకంట? నాకు కోపం తెప్పించావంటే రఫ్ ఆడించేస్తా! కట్టుకున్న పెళ్ళామంటే రానురాను నీకు బొత్తిగా గౌరవం లేకుండా పోతోంది. బీకేర్‌ఫుల్...'

'పుల్లేలే! హాఫ్ ఏనాడేడ్చింది గనుక?... రోజూ ఫుల్లే... అదే బీకేర్‌ఫుల్...' చేయి పట్టుకుని పవిత్రని వాష్‌బేసిన్ దాకా నడిపించి బ్రష్ మీద పేస్ట్ వుంచి పెళ్ళానికి పాచి పళ్ళు తోమే ప్రయత్నంలో నిమగ్నమైనాడు.

'ఈరోజు ఆఫీసుకి శలవు పెట్టండి' తోమిన పళ్లను మిర్రర్‌లో ఇకిలించి చూచుకుంటూ అంది పవిత్ర.

చచ్చాన్రా దేవుడా?... భర్తల దినోత్సవంనాడైనా నాకు ఇంటిపని... పెళ్ళాంసేవ తప్పుతుందేమోనని ఆశించాడు. ఇప్పుడేమో... ఏకంగా శలవు పెట్టించి అన్ని తోముళ్ళూ తనకే అంటకడుతుంది కాబోలు... మనసులో తలపోశాడు.

ఈరోజైనా ఎస్కేపౌదామనుకుంటే... చావకొట్టి చెవులు మూసేట్టుంది ఈ మహా ఇల్లాలు.

గృహహింస నుండి తనకు విముక్తి ఎప్పుడో?... ఇంకెప్పుడూ... చచ్చాకనే! కొందరి జీవితాలింతే! కట్టుకున్న భార్యకి జాలి దయ వుండదు. మొగుడ్ని రాచి రంపాన పెడితేగాని తృప్తిగ వుండదు. శాడిస్టు పెళ్ళాంతో వేగడం దుర్భరం...

పోనీ ఏ పోలీస్టేషన్లోనైనా తనని చీల్చి చెండాడేస్తోందనేసి రిపోర్టిద్దామా అంటే... ఆడవారిచ్చే ఫిర్యాదులే టేకప్ చేస్తారుట గానీ... మొగుళ్ళిచ్చేవాటిని పట్టించుకోరట.

'అక్కడికేదో విరగబడిపోతున్నట్టు... పళ్ళు తోమటానికే ఇదైపోతావేం?...' చెవి మెలేసింది. బాధతో లబోదిబోమంటూ మొగుడు గంతులేస్తోంటే తోమిన పళ్ళు ఇకిలించింది పవిత్ర.

★ ★ ★ ★ ★

ఆఫీసుకు శలవు పెట్టాలా వద్దానే సందిగ్ధంలో పడ్డాడు సుబ్బారావు.

ఒకవేళ పెడితే... రోజంతా పవిత్ర పెట్టే హెరేస్‌మెంట్ తట్టుకోలేడు. పెట్టకపోతే పుట్టగతులుండవ్!

కీడెంచి మేలెంచమన్నారనే సామెత గుర్తుకొచ్చి తాను ఆఫీసుకు రావటంలేదనే విషయం

ఫోన్ ద్వారా బాస్‌కి తెలియచేసాడు.

'ఆఁ!... ఈరోజు మీ దినోత్సవం కదా... చాలా సంతోషంగా వుండాలి కదా మనం! మరి పండుగ చేసుకోవాలంటే స్వీటు హటూ చేసుకోవాలి కదా...?. మాంఛి కొత్త ఐటమ్ ఏదైనా చేసేసి రుచి చూపించు. ఏం?...' న్యూస్ పేపర్ తిరగేస్తూన్న పవిత్ర మనసులో కోరిక బైటపెట్టింది.

వచ్చా(నా దేవుడా! వరి వంటే అనుకున్నాను... శలవు పెట్టించింది నాచేత స్వీట్లు చేయించటానికా?... చెయ్యను... ఛస్తే చెయ్యను. అస్సలుకి చేయనుగాక చేయను. ఏం చేస్తావో చేస్కో...'

'ఏంటి నీలో నువ్వే గొణుక్కుంటున్నావ్? స్టాప్ మర్మరింగ్...' తలపక్కకి తిప్పి సుబ్బారావును చూస్తూ అంది.

మర్మరింగోటి నా ముఖానికి.! తన అశక్తతకు తను తిట్టుకున్నాడు.

అసలే సన్నగా దర్భపుల్లలా వున్నావా... ఇంకా కే.జీ.లకొద్దీ స్వీట్లు మింగావంటే... ఇంటి దర్వాజాలు మార్పించాల్సి వస్తుంది... అనేసి గొణుక్కుంటూ 'నీకేం కావాలో కోరుకో పవిత్రా...' అడిగాడు.

'నీకు జాంగ్రీ చేయటం వచ్చా?...'

రాదన్నట్టు తల అడ్డంగా ఆడించాడు.

'పోనీ మైసూర్‌పాకో... లేదూ బందరులడ్డో...'

'పాయసం వక్కటే నాకు చేతనౌను...'

'కొత్త ఐటమ్స్ నేర్చుకోవాలోయ్. మొగుడివంటూ గుండెలు బాదుకుంటే చాలదు. నీకు రాకపోతే మరోవారం శలవుపెట్టు... పుల్లారెడ్డి స్వీట్స్ వాళ్ళ దగ్గర కెళ్ళి నేర్చుకునిరా. అప్పుడు ఎంచక్కా... నాకు రోజుకో స్వీటు చేసి రుచి చూపిద్దువుగాని...' తిట్టినట్టే మాట్లాడింది.

హే!... శ్రీరామచంద్ర ప్రభో... ఇదేం నరకయాతనరా దేవుడా?... ఏ జన్మలో ఏ పాపం చేసుకున్నానో ఈ జన్మలో దీనికి మొగుడ్డైనాను. ఈ బ్రహ్మారాక్షసికి భర్తనై అష్టకష్టాలు అనుభవిస్తున్నాను... ఇక నేను దీనితో వేగలేను దేవుడా... నాకు విముక్తి ప్రసాదించు...! మనసులో దేవుడిని వేడుకున్నాడు.

'ఏమిటలా దరిద్రపుగొట్టు ముఖంపెట్టి... దివాళా ఎత్తిన వాడిలా పోజిచ్చావ్? సర్లే... స్వీట్స్ సంగతి అలా వుంచి... నన్నేదైనా ఇంగ్లీషు పిక్చర్‌కి తీసుకెళ్ళు. ఇద్దరం ఎంచక్కా చెట్టాపట్టాలేసుకుని అలా తిరిగొద్దాం! ఎప్పుడూ ఇంటికే అంకితమైపోతూంటే బోర్‌కొట్టి...

మెంటలొచ్చేట్టుంది...' చదివిన పేపర్ టీపాయ్ మీదికి విసిరి వెనక్కు వాలిపోయి అంది పవిత్ర.

క్రిష్ణ క్రిష్ణ!... నిన్ను వెంటపెట్టుకుని సినిమాకా? నా స్కూటర్ వెనక కూర్చోవటానికి సీటు చాలదు?... ఆటోలోనా పట్టవ్!... నువ్వా నడిచి చావలేవ్...సరే ఎట్లాగో అట్లా ట్రాలీ తెప్పించి నిన్ను థియేటర్ దాకా తోసు (సారీ తీసు)కెళ్ళినా... లోపల సీటుకి నీ పన్నా సైజు సరిపోదు... నానా ఇబ్బందీ... చుట్టూ వున్నవారంతా మన అవతారం చూసి నవ్వుతూంటే... నాకేడుపొస్తుంది... తెలుసా?... అంతర్గతంగా వాపోయాడు.

'మీరేమనుకుంటున్నారో గ్రహించగలను...'

అంటే?... ఓసి దీని దుంపతెగిపోను?... దీనికి మైండ్ రీడింగ్ విద్య కూడా వచ్చునా?... అన్పించింది.

'నీ కోరిక తీరేది కాదుకానీ... ఎంచక్కా సినిమా సీడీలు తెచ్చి పడేస్తాను. ఒకటి తర్వాత మరొకటి రోజంతా చూసెయ్. సరేనా?...'

'ఇదే నీతో వచ్చిన తంటా! అందుకే నువ్వంటే నాకు వళ్ళుమంట! లక్షలు పోసి మా డాడీ నిన్ను నాకు కొనిపెట్టాడు. ఎందుకు? ఇందుకేనా?... నువ్వో చవటవని తెలిసివుంటే... నిన్ను చుట్టు (సారీ.... కట్టు)కునే దాన్నేకాదు. ఎంచక్కా... ఏ షారుక్‌నో... లవ్వాడేసి మేరేజ్ చేసుకుని సుఖపడి చచ్చేదాన్ని...' మొగుడ్ని తిట్టి... తనను తాను నిందించుకుంది పవిత్ర.

'నో...నో...నో! కూరలో కరివేపాకులాగ... బియ్యంలో రాయిలాగ నన్ను బొత్తిగా తీసిపారేమాకు! నువ్వసలు నా కోసమే పుట్టావ్! అందుకేనేన్నిన్ను కట్టుకున్నాను. మనిద్దరం మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా వున్నామని ఇప్పటికే లోకం కోడైకూస్తోంది. నిన్నిట్లా నీ సహధర్మ (చారిణికి బదులన్నమాట) భర్తగా సుఖసంతోషాలతో ఇంటెడు చాకిరీ చేస్తూ ఆనందంగ (విచారంగ అంటే చంపేస్తుంది కనుక) బతకనీ!... నే హరీ అన్నాక... అదే నేను పోయాక (పారిపోయాక కాదు) ఇంకోరకంగా చెప్పాలంటే కన్నుమూసాక... నీ ఇష్టంఫేర్... నీ ఇష్టం బైట్! నిన్నెవరూ ఆక్షేపించరు. ఓ.కే.నా! కడుపులో మంట చల్లార్చుకునే ప్రయత్నంలో మాట్లాడేడు సుబ్బారావు.

'నువ్వట్లా వెటకారంగా మాట్లాడితే మండుద్ది...' పళ్ళు పటపటా కొరికింది.

'అహఁ... నీకు మండనిదెప్పుడూ?... నన్ను చూస్తేనే మంట!... ఏంఁచేసేది? అంతా నా పూర్వజన్మ సుకృతం...' కారే ముక్కు చీరన చీది కళ్ళొత్తుకున్నాడు.

'నువ్వేడిస్తే నాకు చెడ్డ చిరాకు...' విసుక్కుంది.

'హేరామా!... హే లక్ష్మణా... నాకీ జన్మ వద్దు. నన్ను తీసుకుపో...' నేలమీద పడి గిలగిలా

మూర్ఛరోగికి మల్లే కాళ్ళు చేతులు కొట్టుకోనారంభించాడు.

'పోతే బావుండు... పీడ విరగడైపోతుంది... మొగుడై ఏం వుద్ధరిస్తున్నావు కనుక?... ఈనగారికీ ఇలాంటి రోగం కూడా వుందన్నమాట....' లైట్‌గా శాపనార్థాలు పెట్టింది.

కాస్సేపటికి తెప్పరిల్లుకున్న సుబ్బారావు బిత్తరిచూపులు... వెర్రిమాలోకంలాగ చూడటం మొదలుపెట్టాడు... ఈ విధంగా యాక్షన్ చేస్తేనైనా భర్తల దినోత్సవం కాబట్టి ఈ రోజైనా ఇంటిపని... వంటపని తప్పుతుందేమోని.

'ఈ మాత్రం దానికే పీక తెగిన కోడి మొండెంలా గిలగిలా కొట్టుకుని విలవిల్లాడిపోవాలా?...'

సుబ్బారావు మనసు గాయాన్ని కెలికి మాటల్తో పుండు చేయాలనే ప్రయత్నంలో వాగేస్తోంది పవిత్ర.

'చూడు నా అందాల మొగుడా... భర్తల దినోత్సవమైనా... సింగినాదం దినోత్సవమైనా... ఐ డోన్ట్ కేర్! కిచన్లో దూరి వంట మొదలుపెట్టు. ఈ రోజైనా కోడి పలావ్ చేసి తగలడు...' ఆర్డర్ జారీ చేసింది.

సమస్త దేవుళ్ళనీ తిట్టుకుంటూ ఇదెక్కడి తలరాతరా దేవుడాని... సరాసరి దొడ్లో కెళ్ళి గంపకింద వున్న కోడిపెట్టని బైటికి లాగి పక్కనేవున్న కత్తితో దాని పీక తెగ్గోసాడు (అత్తమీద కోపం దుత్తమీద చూపినట్టు!). డ్రెస్సింగ్ చేసి (అంటే ఈకలు పీకి) ఇంట్లోకి తీసుకెళ్ళి ముక్కలుగా నరికి పోగులుపెట్టి... మసాలా దినుసులు మిక్సిలో వేసి ఆడించి... వళ్లు దాచుకోకుండా బిర్యానీ చేయటంలో నిమగ్నమైనాడు సుబ్బారావు.

ఏలిన్నాటి శని ఎప్పుడు విరగడవుతుందో...? ఏడాదికోమారొచ్చే భర్తల దినోత్సవం నాడైనా సుఖపడనిచ్చి చావదు... అపవిత్రమైన తిట్లతో శాపనార్థాలు పెట్టాడు పెదాలు కదలకుండా!

అక్కడికి... భర్తలేం సుఖపడి ఏడుస్తున్నారు గనుక ఈ పవిత్ర భారతావనిలో? వీధిలో కలాపి చల్లటం మొదలు... పిల్లల ముడ్డి కడిగేదాకా మొగుడు మహాశయుడు చేస్తున్నా... ఇంకా ఏదో తక్కువైనట్టు... పెళ్ళాలు మగాడి మీద పడేడుస్తుంటారు ఈ కంట్రీలో.

అసలు... ఆడదానికి మొగుడయ్యేకంటే... అడవిలో మానైపుట్టుట నయమనిపిస్తుంది!... తిట్టిన తిట్టు తిట్టకుండా అన్ని భారతీయ భాషల్లోనూ తనను తాను పరుష పదజాలంతో నిందించుకున్నాడు సుబ్బారావు. అప్పటికి గాని మనసు కుదుటపడి శాంతించి చావలేదు.

జన్మజన్మలకీ ఈ మగ బతుకొద్దురా బాబూ... కుళ్ళి కుళ్ళి వెక్కిళ్ళు పెట్టకుండా (పవిత్ర ఎక్కడ వింటుందోని) ఏడ్చాడు.

అత్యంత కమ్మగా వండిన బిర్యానీని భార్యాభర్తలిద్దరూ ఎగబడి తిన్నారు. గిన్నెలో ఒక్క మెతుక్కూడా మిగల్చకుండా నాకేశారు.

'ఇందాక ఫోనొచ్చినప్పుడు... నువ్ కిచన్లో.. బిర్యానీ వండడంలో నిమగ్నమైనావ్... ఇప్పుడు మళ్ళీ యాదుకొచ్చింది. ఓరి నా మొగుడో... హార్టీ కంగ్రాట్స్!! పవిత్ర మాటకి కంగారు పడిపోయాడు.

'బిర్యానీ రుచిగా వండిపెట్టినందుకా?...' అడిగాడు.

'ఓవరాక్షన్ చెయ్యకు!...' భర్తను కౌగలించుకుంది.

ధృతరాష్ట్ర కౌగిలిలా అన్పించి... పిచ్చుకపిల్లలా విలవిల్లాడిపోతూ గిలగిలా కొట్టుకున్నాడు. ఊపిరాడకపోవటంతో 'నీకు దణ్ణం పెడతా నన్నొదులు... నీ ఇనుప లవ్ పాడైపోనూ...' బిగికౌగిలి విడిపించుకుని భార్య చేతులకు అందనంత దూరం జరిగాడు.

'నువ్ బెస్ట్ హజ్బెండ్‌గా సెలెక్టయ్యావ్... తెల్సా?...' ఇంతకుముందే ఫోన్ మెసేజ్ అందుకున్నాను. ఈవెనింగ్ ఇద్దరం అవార్డ్ ప్రజంటేషన్‌కి వెళ్ళాలి. గెట్ రెడీ...' పాఠం వల్లించిన రీతిలో గడగడా చెప్పింది.

సుబ్బారావుకి మతిమళ్ళిపోయింది! తనకు 'ఉత్తమ భర్త' అవార్డ్ రావటమేమిటీ?... అంతా అయోమయంగా తోచటంతో వెర్రిమొహం వేశాడు.

శ్రీరామచంద్రులవారు శివధనుస్సును ఫెళఫెళా శబ్దంతో విరిచినట్టు... పవిత్ర గలగలా ఇల్లెగిరేలా నవ్వుతూ 'క్రితం వారం మీ తరపున నేనే ఎంట్రీ పంపాను కమిటీ వారికి!... అదృష్టం మిమ్ము వరించటంతో ప్రప్రథమంగా మీరెన్నికైనారు... లక్ష రూపాయల క్యాష్ ప్రైజ్‌తోపాటు పదితులాల వెయిటుండే 'గోల్డ్ మెడలూ' ప్రశంసాపత్రం కూడా ఇస్తారట! ఫంక్షన్ రవీంద్ర భారతిలో తెలుసా?!...' అమాంతం మీదపడి ముద్దాడేసింది సుబ్బారావుని.

పవిత్ర మహాకాయాన్ని మొయ్యలేక కుయ్యో మొర్రోని మొత్తుకున్నాడు.

మొత్తానికి 'బెస్ట్ హజ్బెండ్' అవార్డ్ భర్తల దినోత్సవం నాడు అందుకుంటున్న సుబ్బారావు బహుదా అభినందనీయుడు!!...

- సమాప్తం -